
# రెవ. పురుషోత్తము చౌధరి

ఆంధ్రక్రైస్తవ శాస్త్రీయ సంగీత, వాగ్గేయ కారులలో శిఖర ప్రాయుడైన కవి సామ్రాట్ పురుషోత్తము చౌధరి దివ్య సంస్మరణార్థం ఈ యేడు శ్రీసభ వాడవాడలలో స్థానిక సంఘములు, సంస్థలు, సమాజములు ఐక్యవేదికలపై ఉమ్మడి కార్యక్రములను పేర నిర్వహించుచున్నారు. అవశ్యము. ఆంధ్రావనిలో మాత్రమే కాదు. లోకమంతట విస్తరించిన తెలుగు వారు స్థానిక సమాజములుగా ఏకీభవించి పూనుకొనవలసిన ధర్మకార్యమిది. ఏకాంత ధ్యానములోగాని, కుటుంబ ప్రార్థనలలో గాని సంఘురాధనలోగాని వారి కీర్తనలను ఆలపించని వారుండరు. చౌధరి గారి కృతులు లేని క్రైస్తవ కీర్తన పుస్తకమును మనమూహింపగలమా! మందిరాలలో బృంద గానములు చేయుటతో తృప్తిపడక, నగర సంకీర్తనము చేయుట వలన వారి కీర్తనలను విశేషముగా ప్రచురము చేయగలము.



పర్లాకిమిడి (ఒరిస్సా)లో స్థిరపడిన ఒక బెంగాలీ బ్రహ్మణ కుటుంబములో కూర్మనాథ చౌధరి సుభద్రాదేవి చౌదామణి యను దంపతులకు 1803 సం॥సెప్టెంబరు 5వ తేదీన ద్వితీయ సంతానముగా పురుషోత్తము జన్మించెను. పాండిత్యమునకు పాలనాదక్షతకు మారుపేరుగా "చౌధరి" యను బిరుదు వీరి వంశమునకు సంక్రమించిన హోదానే గాని ఆంధ్ర రాష్ట్ర మండలి చౌధరియను కమ్మవారికిని వీరికిని సంబంధములేదు. ఈస్ట్ ఇండియా కంపెనీలోను, సంస్థానాధీశుల యొద్దను విశ్వాసపాత్రులుగా వీరి పితరులు పలు హోదాలను నిర్వహించిరి.

వీరు వంగ, ఉత్కళము, తెలుగు సంస్కృతము, హిందూస్థాని, ఆంగ్లమును నేర్చిన బహుభాషాకోవిదుడు వయసు హెచ్చిన కొలది పురాణేతిహాసములనేగాక, వేదపారాయణము గూడా చేయుచు, సంధ్యావందనాది నిత్యకృత్య నిరతతులైన ఏకసంథాతాగ్రాహులలో ఒకరైరి. అమరాంధ్రములలో పేరు గడించిరి. మహాభారత, భాగవత, రామాయణముల అధ్యయనమును ముమ్మారు పూర్తిచేసిరట. బాల్యముననే పురుషోత్తము విష్ణు సంబంధమైన విగ్రహోపాసములు చేయుచు జపస్నాన ఉపవాసములందును. తీర్థయాత్రలు చేయుటలోను మిగులు శ్రద్ధగలిగి భుజముల మీద శంఖుచక్రములు కాల్పించుకొని గురువులు నేర్పిన మంత్రముల పఠించుచు తిరునామా కీర్తనలు పాడుట వారి నిత్యకృత్యములట. ఆయన చాలా కౌతుకము కలవాడైవారు తన చతురతితో దర్బారులనేమి సంగీత కచేరీలలోనేమి, సభికులను మెప్పించి శభాష్ అనిపించుకొనేడి వారట. వీరు ఇరువదియవ యేట తన మేనమామ కుమార్తె రఘునాథపాల్ మహంత్‌గారి కుమార్తెయగు రాధామణి దేవికి తొమ్మిదవ యేట, సప్తపదిన వివాహము మహావైభవముగా జరిగినది. పురుషోత్తము ఉపాధ్యాయ వృత్తి చేపట్టి, అనేక పద్య,గద్య భాగములను రచించిరి. భక్తి, జ్ఞాన, కర్మ, వైరాగ్య రాజయోగాది సాధనములన్నింట శిక్షణ బడసినను ఆత్మలో శాంతి పొందుటకు వేదాంతియై కౌపీనధారియై అవధూతయై అఘోరియై దిగంబర సాధువులతో దిరుగుచు, శాంతిలేక మోక్షమార్గమేదియని చింతించు సమయమున, సిరంపూర్ నుండి విల్యంకేరి యను మిషనెరీ ప్రచురించిన "సువార్త" కరపత్రమును చదువగా అతని ఆత్మలో శాంతి కలిగెను. పురుషోత్తము చౌధరిగారి పద్య,గద్య కీర్తనలలో స్పుటముగా కన్పించు అంశములు మూడు విగ్రహారాధన, కులాచారము, సాంఘీక దురాచారమనునవి. ఆయన హిందూమత ద్వేషికాదుగాని, యూరప్‌ఖండములో 15,16 శతాబ్దములలో సామాన్య ప్రజల అమాయకత్వమును ఆసరాగా తీసికొని పెచ్చుపెరిగిన పూజారి తంత్రమును నిరసించుట గురిగా పెట్టుకొనెను. నాటి నుండి ఆయనలో సత్యాన్వేషణ ప్రారంభమాయెను. దాదాపు 400 మైళ్ళు ప్రయాణము చేసి తెలుగు నూతన నిబంధనను సంపాదించి పఠించగా అతని ఆత్మతృష్ణతీరెను.

1833 సం॥ జూన్ 10వ తేది యజ్ఞోపవీతము (జంధ్యము)ను త్యజించి మేజర్ బ్రెట్ గరాకి సమర్పించి బహిరంగముగా తన కులమును పరిత్యజించెను. రెవ. చార్లెస్ లేసీ గారి వలన 1833 సం॥అక్టోబరు 6వ తేది ఆదివారము సర్వాంగ దీక్షాస్నానము పొందుటకు 300 మైళ్లు ప్రయానము చేసి బాప్తీస్మము ప్రవేశాచారము వలన బహిరంగముగా క్రైస్తవ ధర్మమును స్వీకరించెను. ఆ సాయంకాలముననే ప్రభుకృపావరప్రసాదము (పరిశుద్ధ సమభాక్త్యము)ను గ్రహించెను. 1835 డిసెంబరు 22వ తేదీన భక్తవరుని సతీమణి ప్రభుభక్తురాలై జీవింపసాహసించి తన భర్తను అనుసరించెను. 1836 సం॥ఏప్రిల్ 3వ తేదీన రెవ. ఎ. సట్టన్ గారి వలన ఆమె బాప్తిస్మము పొందెను.

పురుషోత్తము చౌధరి గారి కీర్తనలు 130 అని పరిశోధకులు, చరిత్రకారుల నొక్కి వక్కాణించుచున్నారు. గాని, నేటి వరకు ఆ కీర్తనల సంపూర్ణ ప్రతిగాని, పట్టికగాని కనిపించుటలేదు. బాప్టిస్ట్ మిషనెరి విల్యం డాసన్ గారును మన కవిగారును కలసి చివరిగా ప్రచురించిన ప్రతిలో 78 కీర్తనలు చౌధరిగారివే. అవి లభ్యం కాలేదు. ఆ వెనుక చౌధరిగారు అప్పడప్పడు వ్రాసిన కీర్తనలను

(మిగతా 29వ పేజీలో)

# రెవ. పురుషోత్తము చౌధరి

(చివరిపేజి తరువాయి)

విడివిడిగా పత్రికలకు, మిషనెరీలకు, సంస్థానాదీశులకు మిత్రులైన బ్రిటిష్ అధికారులకు పంపెడివారు. మరియొక కారణము వృద్ధాప్యమున తెలుగు ప్రాంతమునకు దూరముగా యుండుట వలన ప్రచురణ పనికి అంతగా పూనుకొనలేదు.

అగనంపూడి మొదలుకొని రమారమి హైదరాబాద్ వరకు 105 గ్రామాలు నిరాడంబరముగా 3000 మైళ్లకు పైగా పాదయాత్ర చేసిరి. ఆ మహనీయుడు అడుగిడిన చోట్లెల్ల ప్రేషితోద్యమ కేంద్రములుగా వర్ధిల్లినవి. పట్టణములు మాత్రమేగాక, పల్లెసీమలు, మన్య ప్రాంతముల లోతట్టు గూడెములు, వల్లపు ప్రాంతములలోని కుగ్రామములు కలియతిరిగినట్టు ఈ 105 ఊళ్ళ పేరులు ప్రస్తావించబడినవి.

భక్తవర్యుని గుణశీలములను మతాసక్తిని పరీక్షించి ప్రేషితునిగ నుండయోగ్యులని నిశ్చయించిన మీదట ఏప్రిల్ 24వ తేదీన కటక్ (కటకపురి)లో ఆదివారమున ముగ్గురు మిషనెరీలు హస్త నిక్షేపణమును చేసి పరిశుద్ధ పరిచర్య ధర్మము నెరుపుటకు అభిషేకించిరి. దైవ సంకల్పము ఎంత ఆశ్చర్యమే! రాజైన హిజ్కియ మరణించిగ, తన సేవ కొరకు దేవుడు ప్రవక్త యెషయాను లేవనెత్తినట్లు, విల్యంకేరీ గారి మరణ లోటునకు చౌధరి గారిని అనుగ్రహించెను. పదేండ్లు ఘనమైన నిర్విరామ సువార్త సేవ చేసి బరంపురము వచ్చుసరికి సాతాను గర్జించుకొదమ సింహము వలె భక్తుని చీల్చి తినివేయుటకు గొప్ప శోధనతో మన ప్రియునిపై దాడి చేసేను. అది రహస్య పాపమైనను. దివారాత్రములు తన మనస్సాక్షిచేయు నేరారోపణకు తట్టుకొనజాలక పశ్చత్తాపముతో కృంగి కృశించి కటకపురికి వెళ్ళి సేనానివేశన స్థలమున పల్లపు ప్రాంతనదీ తీరమున నేకాంతముగా దినములు గడుపుచుండెను. ఒకానొక దినమున ఉత్తమ మనస్తాపనతో మహానది తీరమున నున్న యొక సారంగమున దినమెల్ల దుఃఖక్రాంతుడై "త్రహిమాం క్రీస్తునాధా" యను పాప విలాస గీతమును గొప్ప ఆర్తితో వ్రాసుకొనెను. బరంపురము తిరిగి వచ్చి ఎవ్వరిని చూడక ఒంటరిగ దినదినము కుమిలి పోవుచుండగ ఆయనకు అభ్యంగన స్నానదీక్ష నిచ్చిన రెవ. చార్లెస్ లేసీ గారు ఆయనను అనుదినము దర్శించినపుడు "నా పాపము క్షమింపబడనేరదను నిరాశను పురుషోత్తముడు వ్యక్తపరచగ" యేసు పాప క్షమార్పణ దాతకాడను అవిశ్వాసమే మహా పాపమని" చెప్పినంతనే భక్తవరుడు తన విశ్వాసమును కూడగట్టుకొని 1845 సం॥ "ఎందుకే చింతించెదవు" (హెబ్రీ 13:5) యను కీర్తన వ్రాసుకొనెను.వారే మరియొక సారి లేసిగారు పురుషోత్తమా సోదరా మీ పాపము లెక్కువైనవా క్రీస్తు స్లీవ రక్తపు చుక్క విలువ యెక్కువైనదా? యని ప్రశ్నింప చౌధరి గారి సందేహమంతయు పటాపంచలై శుభప్రద నిరీక్షణతో "ఉన్నపాటున వచ్చుచున్నాను" యను కీర్తన వ్రాసుకొనెనట. శరీరెచ్చ, నేత్రాశ, జీవపు డంబమను శోధన పరంపరలచే ఐహిక విషయముల వైపు నీడ్వబడు తరుణములో ఆత్మ సంబోధనముగ "వద్దు మనసా -బుద్దికురచ" యను హెచ్చరిక గీతము వ్రాసెను. ఆ వెనుక పరితపము, పాపపు టొప్పుకోలు, పశ్చత్తాపము నొంది క్షమానుభవము గలవాడై "యెహోవ నా మొఱలాలించెను" యను ప్రార్థనా ప్రతిఫలానంద గానము వ్రాసెనని యూహింపవచ్చును. పిమ్మట కటకపురి (కటక్) ప్రాంతీయ మిషనెరీ మహాసభలో ఈ భక్తుని ఉత్తమ మనస్తాపన చాలా మందికి ఆమోదముగ యుండినందున సట్టన్ విధించిన కఠిన పరీక్షకు లోబడి తక్కువ జీతముతో బదిలీ ఐనాడు. దరిమిలా విల్యం డానస్ గారితో పని చేయునట్టు మరల ఉద్యోగ ప్రవేశము చేసిరి. అట్టి యేర్పాటే విశాలాంధ్రకు వారి సేవా ఫలములు అంది ఆశీర్వాదకరమైనవి. వారిరువురు చేసిన ప్రచురణ సేవ ఆంధ్రక్రైస్తవలోకానికి చిరకాల కానుకగ మిగిలినది 1866 సం। మూడవ ప్రచురణలో చౌధరి గారి కీర్తనలే 78 కలవు. కాని, చివరికి వారు మొత్తము మీద రచించిన 130 అని తెలియుచున్నది.

చౌధరి గారికి రహస్య (ఏకాంత) ప్రార్థన చేసుకొనువాడుక కలదు. నాగావళి నది ఇసుక తెన్నుల మీద అర్ధరాత్రి వరకు ధ్యానించి, ప్రార్థించి కీర్తించెడివారు. వారి సతీమణి బిడ్డలను దైవభక్తితో పెంచెను. ఆ ధన్యజీవులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కలరు. 1851 సెప్టెంబరు మాసమున రాధామణిదేవి ప్రభువునందు నిద్రించెను. అప్పటికి ఆయన వయస్సు నలుబది రెండేళ్ళు. అయినను ద్వితీయ కళత్రమును గూర్చి ఆయన ఎన్నడు తలంచలేదు. పురుషోత్తముని అన్న గారైన జగన్నాధ చౌధరి గారి సంతానములో ఇద్దరు ప్రభువును విశ్వసించి క్రైస్తవులైరి. వారి వంశములో ఐదవ తరము వారైన నల్గొండ వాస్తవ్యులు జేమ్సు జయశీల్ చౌధరి గారు. ద్విశత జయంతి మహోత్సవమును పురస్కరించుకుని భక్తవర్యుని పద్య, గద్య, కీర్తనలను అభ్యమైన మేరకు పునర్ముద్రించుటకు వారి అవిరళ కృషిని సర్వేస్వరుడు సఫలీకృమొనర్చుగాక!

1860 సం॥ దాస్ అంతర్వేది అను భక్తుడు చౌధరి గారిని కలుసుకొని వారిరువురు కడు వృద్ధాప్యము వరకు నమ్మకమైన గొప్ప సేవ చేసిరి. చౌధరిగారు తమ ఆధ్యాత్మిక జననియైన శ్రీమతి హెలెన్ నాట్‌గారిని ఎన్నడు మరువలేదు. ఆయన 77వ యేట బెంగుళూరులో యున్న ఆమెకు ఒక కృతజ్ఞత యుత్తరమును వ్రాసెను. 1882 సం॥తాను బహుగా ఎదురుచూచిన మోక్ష ప్రవేశ మాసన్నమైనదని 'సకలేంద్రీ యములారా' వ్రాసిరి. ఆ వెనుక 'పైనమైయున్నానయా' వ్రాసిరి. 1890 ఆగస్టు 27న పరమపదించిరి. కడవరి దినములలో తన ప్రియమైన కీర్తన "ఒక్కసారె జూపు ఓ యేసునాధా' మిక్కిలి మక్కువతో పలుమారులు పాడెడి వారట. దక్షిణ భారతావనికి సర్ ఆర్డర్ కాటన్ అన్నదాత కాగా, మన చౌధరి గారు జీవాహారమైన క్రీస్తును ప్రజలకు ప్రకటించెను. ఆ ఇరువురు ఒకేయేడు జన్మించుట గమనార్హము.